


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: స్కార్లెట్ పండు
## { రిచర్డ్ ఎంగార్డ్సన్ కథకి స్వేచ్ఛానువాదం}
### (కథాకాలం 1958)

**చాలా తరాలుగా** మేము న్యూయార్క్‌లో నివసిస్తున్నాం. మా తాత, తాత అంటే ముత్తాత ఏంథోనీ, పోర్ట్ రిచర్డ్ హిల్‌లో వేలిక్ స్ట్రీట్‌లోని ఓ ఇంటిని డిసెంబర్ 21, 1820న కొన్నాడు. దానికి మార్టియర్ హౌస్ అనే పేరుకూడా పెట్టాడు. ఆ పాత ఇంటిని మా పూర్వీకులు ఎవరూ అమ్మకపోవడంతో ఇప్పుడది నా ఆధీనంలో ఉంది. న్యూయార్క్‌లోని డౌన్‌టౌన్‌లోగల అతి కొద్ది పురాతన ఇళ్ళల్లో అదొకటి. స్థానిక చట్టం ప్రకారం దాన్ని పడగొట్టకూడదు. ఆ నియమం లేకపోతే, ఈపాటికి అక్కడో స్కై స్క్రేపర్ వచ్చి ఉండేది.

ఆ రోజు నేను వంటగదిలోని చిమ్నీకి ఉన్న ఓ ఇటుక వదులవడం గమనించాను. దాన్ని సర్దుతుంటే, అందులో నాకు ఓ పురాతన కవర్ కనిపించింది. ఆసక్తిగా దాన్ని తెరిచి చదివాను. ఆ ఉత్తరం ఎవరిని ఉద్దేశించి రాయబడిందో వారికి ఎందుకనో చేరలేదు అని గ్రహించాను. ఆ ఉత్తరం లెఫ్టినెంట్ జనరల్ సర్ విలియం హోవే అనే న్యూయార్క్‌లోని బ్రిటిష్ సైనిక కమాండర్‌కి జూలై 29, 1776న మా ఇంట్లోనే రాయబడింది. బాతు ఈకతో దళసరి కాగితం మీద రాయబడ్డ ఆ ఉత్తరంలోని అక్షరాలు వెలిసిపోయినా, లేత తోపు రంగులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ ఉత్తరం అమెరికన్ చరిత్రనే మార్చివేసే ఉత్తరం అని దాన్ని చదవగానే నాకు అర్థమైంది.

ఎస్టీండ్ అండ్ రెస్పెక్టెడ్ లెఫ్టినెంట్ జనరల్ సర్ విలియం హోవే,

ఈ ఉత్తరం మీకు అందేసరికి తిరుగుబాటు దళాలకి నాయకత్వం వహించే జార్జి వాషింగ్టన్ మరణిస్తాడు. తలలేని పాముకొంత సేపు కొట్టుకున్నా, దానివల్ల ఎలా ఎలాంటి ప్రమాదం ఉండదో అలా తిరుగుబాటు దళాలు కూడా ఇక ప్రమాద రహితం అవుతాయి. నేను కూడా చంపబడచ్చు. ఐతే అది నాకూ నా కుటుంబ సభ్యులకి మాత్రమే విషాదకరం అవుతుంది.

జనరల్ వాషింగ్టన్ దగ్గర వంటవాడిగా పనిచేస్తున్న నేను ఇంతదాకా మీకు వారి పథకాలు, సైనికుల కదలికల గురించి సమాచారం ఇస్తూ వస్తున్నాను. ఇప్పుడు బ్రిటిష్ రాజరికానికి మరింత ప్రాముఖ్యంగల సేవని అందించబోతున్నాను. పంటి నొప్పితో బాధపడే వంటకంలో, ప్రాణాంతకమైన ఓ ఎర్రటి స్కార్లెట్ పండుని పై తొక్క మినహా మిగతా అంతా కలుపుతున్నాను. వాషింగ్టన్ సాహసి, యుద్ధ నిపుణుడు మర్యాదకల మనిషిగా పేరు పొందాడు. తిరుగుబాటు దళాలన్నీ ఆయన్ని గౌరవిస్తాయి. అందువల్ల కింగ్‌జార్జి పాలన్ ఇక్కడ కొనసాగడానికి ఆ గౌరవనీయమైన వ్యక్తిని నేను రహస్యంగా ఈ రాత్రి విషపు పండుతో కూడిన వంటకంతో చంపుతున్నాను. ఈ ఉత్తరం మళ్ళీ పూర్తి చేస్తాను.

పని పూర్తయింది. జనరల్ వాషింగ్టన్ భోజనం చేసి పడుకోడానికి వెళ్ళాడు. ఇక రేపు ఉదయం నిద్రలేవడు. నేను ఈ ఇంట్లోంచి పారిపోయే అవకాశం లేదు. బయట గట్టి కాపలా ఉంది. రేపు నన్ను తిరుగుబాటదారులు చిత్రవధ చేసి చంపుతారు. వంటవాడిగా నేను విషంతో మరణించడానికి ఇష్టపడను. ఉరివేసుకోవడం కూడా నాకు ఇష్టంలేదు. అయితే, నేను నిత్యం ఉపయోగించే కార్వింగ్ నైఫ్‌ని ఉపయోగించి మరణించదల్చుకున్నాను. ఎందుకంటే దాని వినియోగంలో నేను నిపుణుడ్ని. నా భార్యాపిల్లల సంరక్షణని నేను కింగ్‌జార్జికి వదిలి వెళ్తున్నాను. నా పేరు, గౌరవం నాశనమైనా సరే, నేను బ్రిటిష్ సామ్రాజ్యానికి చక్కటి సేవ చేసాను అనే తృప్తితో వెళ్ళిపోతాను. డియర్ సర్, ఉంటాను.

మీ విధేయుడు, గౌరవనీయమైన సేవకుడు,

జాన్ బెయిలీ

ఈ ఉత్తరంలో రాసింది నిజమైతే, జూలియస్ సీజర్ హత్యానంతరం ఓ ప్రముఖ రాజకీయవేత్త హత్య జరగడం ఒక్క జార్జి వాషింగ్టన్ విషయంలోనే సంభవించేది. ఐతే జార్జి వాషింగ్టన్ 1799దాకా, అంటే మరో ఇరవై మూడేళ్ళు జీవించడని మనకి తెలుసు. వాషింగ్టన్ మీద హత్యాయత్నం జరిగిందని, ముఖ్యంగా జూలై 1776లో జరిగిందని ఎక్కడా నమోదు కాలేదు. ఐనా జాన్ బెయిలీ తను చేయని హత్యకి ఫలితం అనుభవించాలనే భయంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నేను ఆసక్తిగా ఈ విషయం మీద న్యూయార్క్ లైబ్రరీకి వెళ్ళి అందులో పేర్కొన్న స్కార్లెట్ ఫ్రూట్ మొక్క గురించి చదివాను. అమెరికా 1825దాకా ఆ పండు విషపూరితం అని నమ్మేవారు. అప్పుడు, ఇప్పుడు కూడా దాని పేరు టొమేటో.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments